# తొగరుచెట్టు

జిల్లా ట్రెజరీ హెడ్ అకౌంటెంటు చిట్టి వెంకట్రామయ్యగారు ఆవాళ సాయంత్రం గడియారం టంగు టంగున ఐదు కొట్టగానే టక్కున లేచారు. ఇంటికి వెడిపోయారు.

ఏం చెప్మా అనుకున్నారు పెద్ద గుమాస్తాలంతా. ఏదో కొంప మునిగిందనుకున్నారు. ఆయనలో అంత కలివిడిగా వుండని అభ్యుదయ గుమాస్తాలంతా వెటకారంగా. ఇవాళైనా వెలుగులో భార్యా బిడ్డల మొహాలు చూస్తామనుకున్నారు టైపిస్టులూ అటెండర్లూ. అయ్యో యివాళ చిట్టి వెంకట్రామయ్యగారు లేకుండా వొంటరిగానే మరి రెండున్నర గంటలదూరం నడవాలా అనుకుని ఆఫీసు గడియారం వలవల యేడిచింది.

అయితే, గత పన్నెండు సంవత్సరాలలో యిలాంటి విపరీతం జరగలేదు. ఇది జనన తేదీలు అజాయించేపట్ల మనవాళ్ళు భూత కాలంలోని తుఫానులు, భూకంపాలు మొదలైనవి వుటంకించినట్లు చెప్పుకోతగది.

చిట్టి వెంకట్రామయ్యగారు పన్నెండేళ్ళ కిందట ఆజిల్లా ట్రెజరీకి హెడ్ అకౌంటెంటుగా వచ్చేరు. అప్పటికీ యిప్పటికీ ఆయన హోదాలోగాని, ప్రవర్తనలోగాని మార్పు లేదు. ఉదయం పదకొండింటికివచ్చి సాయంత్రం ఏడున్నరకి లేచేవారు. ఎప్పుడూ నవ్వక పోయినా, యేడుపుముఖం పెటలేదు. ఎవర్నీ యెన్ని తిట్టినా పై అధికారితో చెప్పి అపకారం చేయించలేదు. ఆయన్ని అర్థం చేసుకున్నామనుకున్నవాళ్లు గత్యంతరం లేక సమాధానపడ్డారు. ఇతరులు ఆయన మూర్ఖుడనీ, హృదయంలేనివాడనీ ఇంకా ఇంకా 'ఈస్థటిక్ సెన్స్' లేనివాడని అనుకునేవారు.

పోతే, ఆవాళ సాయంత్రం ఐదింటికి అకస్మాత్తుగా ఆయన యెందుకు లేచి వెడిపోయారో యెవ్వరికీ తెలీదు. చివరకి ఆయన ప్రైవేట్ సెక్రటరీలాంటి బంట్రోతు అహమ్మదుకుకూడా తెలీదు. అసలాయనకి ప్రైవేటు జీవితం లేదనే అందరి అభిప్రాయం.

చిట్టి వెంకట్రామయ్యగారిగురించి యితరులకి తెలిసినది ఆయన వొక గౌరవనీయ కుటుంబానికి చెందినవారని, ప్రస్తుతం ఆయనకి 'నా'అన్న దగ్గర దూరం బంధువు లెవ్వరితోనూ యెక్కువగా ప్రమేయం లేదనీ, ఆయన వొంటరిగా వొక మేడలో నివసిస్తున్నాడని మాత్రమే. ఆయన భార్య సుమారు ముప్ఫయేళ్ల కిందట పెళ్లిఅయిన కొద్ది నెలలలోనే పోయిందనికూడా కొందరికి తెలుసు. ఇంకా లోతైనవిషయాలు బంట్రోతు అహమ్మదుకీ, కనీసం పన్నెండేళ్లనుంచీ వంట చేస్తూన్న నరసింహానికీ కూడా తెలీవు.

సూర్యుడికంటె ముందు లేచి స్నానం చేసి, సంధ్యవార్చి, ఆఫీసుకాగితాలు చూసుకుని, తొమ్మిది గంటలకి వేడివేడి పెసరటూ, వుడికించిన కూర, పెరుగూ అన్నం తిని ఆఫీసుకు వెళ్ళడం, సాయంత్రం సుమా రెనిమిదింటికి యిలుచేరి మడికట్టుకుని భోంచేసి, రాత్రి సుమారు పదకొండువరకూ తిరిగి ఆఫీసు కాగితాలు చూసుకుని పడుకోవడం ఆయన దినచర్య. దీనిలో యెన్నడూ యేమీ మార్పుండదు.

## అంగర వెంకట కృష్ణారావు

ఆయన యెప్పుడూ సినిమాలూ నాటకాలూ చూడరు. ఎప్పుడైనా వారి బంధువులెవరైనా అవూరు వస్తే వాళ్ళింట్లోనే దిగేవారు దూరపు అన్నదమ్ములు, రెండు వేళ్ళు విడిచిన మేనమామ మనవరాళ్ళూ, స్నేహితులు, స్నేహితుల స్నేహితులు యిత్యాది. కారణం ఆయనమీద అభిమానం అనుకోవడం సత్యానికి చాలా దూరం; ఆయన కలిగినవాడని, కర్చులేనివాడని. వాళ్ల ఊహ నిజమే. అయితే ఆయన యెవ్వరితోటీ అట్టే మాట్లాడేవారు కాదు. చుట్టపక్కాలున్నప్పుడు కూడా ఆయన మేడమీద తన గదిలోంచి బైటికి వచ్చేవారు కాదు. అంచేత ఆ వచ్చినవాళ్లు కూడా ఆ నవాయితుకు 'బాబా యీ కావున్నావా' అనో 'అన్నయ్యా యెన్నాళ్ళయింది నిన్ను చూసి' అనో పలకరించినా, ఆ యింటిని సుమారొక విశ్రాంతిగృహంగానే భావించేవారు, చార్జీలు మినహా.


చిట్టి వెంకట్రామయ్యగారి 'గది' మేడమీదుంది. మేడమీదున్న గది అదొక్కటే. ఆ గదికి వుత్తరం వేపున్న కిటికీ గుండా పెరట్లో వున్న తొగరు చెట్టు పైభాగం సూటిగా అగుపిస్తుంది. తీరికగా వున్నప్పుడల్లా ఆయన దానివేపు చూసేవారు. ఆయన యెరికని ఆ చెట్టు యెప్పుడూ అలాగేవుంది. ఆకులు లేకుండా మోడులా. దానిని చూస్తూన్నంతసేపూ ఆయన మనసు శాంతియుతంగా వుండేది.

ఆవాళ ఆయన సాయంత్రం ఐదుగంటలకి టక్కునలేచి ఆఫీసునుంచి వెళ్లిపోవడం లగాయతు, ఆర్నెల్లపాటు ఆయన ఆఫీసు జీవితంలో వింతమార్పు వచ్చింది. ఉన్నంతసేపూ అందరిమీదా రుసరుసలాడ్డం, తిట్టడం, ట్రెజరీ ఆఫీసుమీద ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ విసుక్కోవడం. ఎంత గొడవ చేసినా సాయంత్రం ఐదింటికల్లా డ్రాయర్లుమూసి వెడిపోవడం. ఆయన్ని యెవరూ యేమీ అనేవారు కాదు. కారణం ఆయనకి అప్పటికే చాలా సర్వీసు అయిపోయింది. పైగా ఆయన వయసు యాభైలోపైనా, పళ్లూడిపోయి, దిగజారిపోయి అరవై యేళ్లవాడిలా అగుపించేవాడు.

డిశంబరు నెల నడుస్తూంది. హేమంతుడి ప్రతాపానికి తట్టుకోలేక పృథక్ శయ్యలు ఏకశయ్యలౌతున్నాయి. చిట్టి వెంకట్రామయ్యగారు వొక్క నిద్ర తీసేరు. ఈదురుగాలికి తెలివివచ్చింది. పెరటివేపు కిటికీ తలుపు మూసివేద్దామని లేచారు.

కిటికీదగ్గరకి వెళ్లగానే తొగరుచెట్టు మొండికొమ్మల్లోంచి వొకదృశ్యం అగుపించింది. అవతల వీధిమేడగది కిటికీ తెరిచివుంది. ఎలక్ట్రిదీపం కాంతి దక్కగావుంది.


కిర్లోస్కర్-
-ఇండియామాన్



మోటారులు
ఇంజనులు
పంపులు
చెరకుగానుగలు
విశాఖ శ్రీకాకుళం జిల్లాలకు
విక్రేతలు
రేడియో అండ్ ఎలక్ట్రికల్సు
విజయనగరం
PHONE 111
GRAMS RADELECO

# ★ తొగరు చెట్టు ★

ఒక యువకుడు వొక యువతి—నిటారుగా, నగ్నంగా, గాఢాలింగంలో పెనచుకు పోయేరు, చెట్టుతీగలా. చిటి వెంకట్రామయ్యగారి హృదయం వేగంగా కొట్టుకుంది. వెంటనే చలి పటాపంచలై ఆ పాదమస్తకం వేడెక్కింది.

కిటికీమూసి వెడిపోదామా అనిపించింది. కాని అలా చెయ్యలేకపోయేరు. తను చీకట్లోవున్నారు. వాళ్లు లోకానికి మటుకే చీకట్లోవున్నారు. వాళ్లు నూతన దంపతులై వుంటారు. నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా, రక్తమాంసాసి వరాలకు పంచభక్ష్య పరమాన్నాలతో విందుగా ప్రవర్తిస్తున్నారు. చిటి వెంకట్రామయ్యగారి శరీరం విపరీతంగా కంపిస్తూంది. నిత్యశిశిర జీవితం గడుపుతూన్న ఆ నిర్భాగ్యపు తొగరుచెట్టు అవతలి, జీవితపరిణామంలో మహోద్రేకపూరితమైన యీ ఘటపు విశ్వరూపం యిలా ఆ హేమంత నిశామధ్యంలో ప్రత్యక్షం అవుతుందని ఆయన కలలోకూడ అనుకోలేదు. ఆ పన్ని వేశం ఆయన ప్రవృత్తిని పునాదులతో కుదిపింది.

ఆఫీసులో అంత అలజడి ఆమర్నాడే జరిగింది. కిటికీలో నాటకం ఆరంభం ప్రతిరోజా సాయంత్రం ఆరుగంటలకే. దానికి చివరి అంకం భరతవాక్యం వుంటాయని చిట్టివెంకట్రామయ్యగారు అనుకోలేదు. ఆలసించిన ఆశాభంగమని ప్రతిరోజూ ఐదు గంటలకే ఆఫీసు విడిచిపెట్టేవారు.

కాలచక్రం తిరుగుతూంది. మార్చినెల ప్రవేశించింది. హటాత్తుగా పెరట్లో తొగరు చెట్టు చిగిర్చింది పన్నెండేళ్ళ తరవాత. చూస్తుండగా చెటంతా గుబురై, పచ్చటి ఆకులునిండింది. తొగరుపూల పరిమళాలు చిట్టివెంకట్రామయ్యగారి గదిమీద, కాదు గుండెలమీద దాడితీస్తున్నాయి. ఏంలాభం? కిటికీ కనుపించడంలేదు. ఆయనకి చిర్రెత్తింది. వెర్రెత్తింది. కాలుగాలిన పిల్లిలా అటుమటించిపోయేడు. నిద్ర ఇదివరకేలేదు. కాని ఇప్పుడు నిద్రలేని సుఖంకూడా లేదు.

ఒకనాడు ఆఫీసుకువస్తూనే అహమ్మదుతో చెప్పేడు 'సాయిబూ, మన పెరట్లో తొగరు చెటు నరికించి...వెధవచెట్టు...' సాయిబు హడిలిపోయేడు. 'అదేం అయ్యగోరూ—పాపం ఆ సెటు యెన్నాల్లకో ముచ్చటగా సిగిర్చింది. దాన్నెందుకు నరకాలి?'

'నీకు తెలీదు—సాయంత్రానికి నరికించి' అహమ్మద్ గొణుక్కుంటూ వెడిపోయేడు.

ఒంటిగంటకి ఆఫీసుకి ఒక యువకుడొచ్చాడు చిట్టివెంకట్రామయ్యగారికోసం. ఆయనకి సరిగ్గా గుర్తురాలేదు.

'మరేంలేదు. మీయింటో క్రింద భాగములో చాలాగదులున్నాయిట. వాకో గది అద్దెకిస్తారేమో అని అడుగుదామనివచ్చా.'

'నే నెప్పుడూ యెవరికీ అద్దెకివ్వలేదే... అయినా మీ రెక్కడుంటున్నారు?'

'ఇక్కడే...అంటే ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మీయింటి దగ్గర పానే వుంటున్నా. మా మేడమీంచి మీ పెరట్లో తొగరుచెట్టు అగుపిసుంది...'

చిటివెంకట్రామయ్యగారు అదిరిపడ్డారు. ఇప్పుడు పోల్చి అందింది. కొంచెం సర్దుకుని అడిగారు, 'మీరు బాచిలరా?'

అతడు సిగుతో అన్నాడు, 'కాదండీ... మా ఆవిడ...పుటింటికి వెడుతూంది... మరేం...పురిటికి...ఈలోగా నాకెందుకు అంత యిలని...మీయింట్లో ఏదో వొకగది ఇస్తే చాలు...'

చిటివెంకట్రామయ్యగారి మనసులో ఒక పెద్ద అల్లకల్లోలం లేచి క్రమేణా చల్లబడింది. అది వొక పెద్ద శస్త్రచికిత్స! యువకుడిని మర్నాడు మంచిరోజని తనయింట్లో దిగిపొమ్మన్నాడు.

'అహమ్మదూ...'

'అయ్యగోరూ...'

'తొగరుచెటు నరకొద్దురా...'

'ఏం అయ్యగోరూ...'

'తొగరుచెట్టు చిగిర్చిందిరా...' చిరునవ్వుతో అన్నారు. అహమ్మద్ తో సహా ఆఫీసంతా మూర్ఛపోయింది. ★


పిల్లల కడుపునొప్పులు త్వరలో నివారించును



గ్రైపానిల్
(గ్రైప్ మిక్చర్)

'టువనాల్' వారి ప్రొడక్టు

MARTIN & HARRIS (PRIVATE) LTD.
MERCANTILE BUILDINGS, LALL BAZAR, CALCUTTA - 1.
ALSO AT
BOMBAY MADRAS DELHI RANGOON